క్లుప్తంగా

'నవోదయ' పై కేంద్రానికి లేఖ రాయాలని విజ్ఞప్తి

ధర్మపురి: మండలంలోని నేరెళ్లకు మంజూరైన నవోదయ గురుకుల విద్యాలయాన్ని తరలించకుండా ఉండేందుకు మరోసారి కేంద్రానికి లేఖ రాయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. సోమవారం కరీంనగర్‌లో సోమవారం జరిగిన పట్టభద్రుల బహిరంగ సభకు సీఎం హాజరుకాగా, విప్ విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన సీఎం కేంద్రానికి మరోసారి లేఖ రాసి నవోదయ విద్యాలయాన్ని ఉండే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని టీఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ, డీఏలు, సీపీఎస్ రద్దు, ఈహెచ్ఎస్ అమలు అన్నింటినీ సీఎం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బంది ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ శ్రీనివాస్‌రావు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, కందుకూరి రవిబాబు, హరి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి



పన్నులు వసూలు చేస్తున్న కమిషనర్

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీలో ప్రతీ ఒక్కరు సకాలంలో పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ చిరంజీవి అన్నారు. సోమవారం పట్టణంలో ఆస్తిపన్ను కట్టని వారందరినీ కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి యజమాని ఆస్తిపన్ను కట్టాలని, అప్పుడే పట్టణం అభివృద్ధి చెందుతుందన్నారు. జగిత్యాల మున్సిపాలిటిలో 1301.61 లక్షలకు గాను 664.90 లక్షలు మాత్రమే వసూలైందని, మార్చిలోపు ఆస్తిపన్ను మొత్తం కట్టేలా చూడాలన్నారు. 500 మందికి నోటీసులు జారీ చేశామని, చివరగా రెడ్ నోటీసు జారీ చేసి మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట రెవెన్యూ ఆఫీసర్ కనకయ్య, గోపాల్ ఉన్నారు.

ఇంటి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

రాయికల్: పట్టణంలోని గృహ యజమానులు పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో చిరంజీవి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బకాయి ఉన్న పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో వేసవి కాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదేశించారు. ఎంపీవో సుష్మ పాల్గొన్నారు.

జీపీ సిబ్బందికి పెండింగ్ వేతనాలను చెల్లించాలి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

సారంగాపూర్: పంచాయతీల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని సోమవారం బీర్‌పూర్, సారంగాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోలు లచ్చాలు, గంగాధర్‌లకు పంచాయతీ సిబ్బంది వినతిపత్రాలు అందజేశారు. గతేడాది ఇవ్వాల్సిన రెండు నెలల వేతనం చెక్కులు ఎస్టీవోలో పెండింగ్‌లో ఉన్నాయని, 2025 సంవత్సరం రెండు నెలల వేతనాలు మొత్తం నాలుగు నెలల వేతనాలను గ్రామపంచాయతీ సిబ్బందికి వెంటనే చెల్లించాలని వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇంటర్వ్యూలు

పెగడపల్లి: ఎకనామిక్ రిహాబిలిటేషన్ (ఈఆర్ఎస్) పథకం కింద దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి మంజూరైన ఒక యూనిట్‌కు 31 మంది దరఖాస్తులు చేసుకోగా 27 మంది ఇంటర్వ్యూకు హాజరైనట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల స్థాయి కమిటీ కన్వీనర్ సీడీపీవో వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కనుల పండువగా ఆది దంపతుల కల్యాణం

వెల్గటూర్: మండల కేంద్రంలోని శ్రీ అమరేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివ పార్వతుల కల్యాణ వేడుకలను కనుల పండువగా జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు గంట్యాల విద్యాసాగర్ శర్మ ఆధ్వర్యంలో ముందుగా వేదికలపై ఉత్సవ మూర్తులను ఆశీనులు చేసి స్వామివార్ల కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా జరిపారు. వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శివనామ స్మరణాలతో మారుమోగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బంగారి గంగాధర్, మెరుగు మురళి, జూపాక కుమార్, భరత్, వెంకటేశ్ పాల్గొన్నారు.



ఘనంగా శివుడి శోభాయాత్ర

కథలాపూర్: మండల కేంద్రంలో శివదీక్షా పరుల ఆధ్వర్యంలో రథంపై శివుడి శోభాయాత్ర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అందుకున్న శివుడు రథంపై ఆశీనులయ్యారు. శోభాయాత్ర గ్రామంలోని ప్రధానవీధుల గుండా నిర్వహించగా, భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికి టెంకాయలు కొట్టి పూజలు చేశారు. శివస్వాముల పూజలు, భజనలతో గ్రామంలో శివనామ స్మరణం మార్మోగింది.

సహస్ర లింగాల ఆలయంలో ఏకాదశి వేడుకలు

జగిత్యాలరూరల్: మండలంలో పొలాస సహస్ర లింగాల ఆలయంలో సోమవారం ఘనంగా ఏకాదశి పర్వదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు వివిధ రకాల పండ్లను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నలమాసు గంగాధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శివ పార్వతుల కల్యాణం

మల్యాల: మండల కేంద్రంలో శివపార్వతుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా ఆలయం లోని కల్యాణ మంటపానికి తీసుకు వచ్చారు. వేద మంత్రోచ్చారణల మధ్య శివ పార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం పోశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. బట్టు విజయానంద్, పవన్, భూషణం, వెంకన్న, గోవర్దన్, భక్తులు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



రాజన్న ఆలయంలో పూజలు చేస్తున్న పురోహితులు

పెగడపల్లి: మండల కేంద్రంలోని శ్రీస్వయంభూ రాజరాజేశ్వర స్వామి, వెంగళాయిపేట శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా గౌరి గణనాథ పూజ, స్వస్తి పుణ్యాహవచనం, అంకురారోపణం, అఖండ దీప స్థాపనం, హోమం, సామూహిక నవగ్రహ పూజ, కుంకుమ పూజలు, అష్టోత్తర శతకలశస్థాపన, రుద్రహోమం, మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు గుండి శ్రీనివాస్‌శర్మ, వినయ్‌శర్మ, రాజేశ్వరశర్మ,మౌనస్వామి ఆధ్వర్యంలో శాస్త్రోపేతంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

వేములవాడ జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మెట్‌పల్లి: వేములవాడ జాతరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మెట్‌పల్లి డిపో మేనేజర్ దేవరాజ్ సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి గురువారం వరకు నడిపే బస్సులు నేరుగా వేములవాడ ఆలయ కరకట్ట వరకు వెళ్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ వాహనాల్లో వెళ్లే ఈ సౌకర్యం ఉండదని, ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం సురక్షితమని, ప్రయాణికులు తప్పకుండా ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

ఘనంగా సాంబశివ జాతర ఉత్సవాలు



సాంబశివాలయంలో పూజలు

బుగ్గారం: మండల కేంద్రంలోని సంతాన సాఫల్య శ్రీ సాంబశివ నాగేశ్వరాలయంలో సోమవారం శివరాత్రి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయ చైర్మన్ మసర్తి రాజిరెడ్డి ఆధ్వర్యంలో అర్చకుల మంత్రోచ్చారణల మధ్య రుద్రాభిషేకం,రుద్రహోమం ఘనంగా నిర్వహించారు. జాతరలో భాగంగా ఈనెల 27వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు. 25న గీతాహవన యజ్ఞం, 26న శివపార్వతుల కల్యాణం, 27న రథోత్సవ కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల కోసం అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

పౌష్టికాహారం, ఆరోగ్యంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

జగిత్యాలరూరల్: మహిళలు ఆరోగ్యం, పౌష్టికాహారం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సెర్ప్ ఫాం డీపీఎం వెంకటేష్ అన్నారు. సోమవారం మండల సమాఖ్య కార్యాలయంలో ఐకేపీ వీఏవోలకు ఆరోగ్యం, పౌష్టికాహారంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్యం పట్ల సరైన ఆహారం తీసుకోవడంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. వెయ్యి రోజుల ప్రణాళిక రూపొందించుకుని వారి కుటుంబం పూర్తిస్థాయిలో ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారాం, శ్రీనివాస్, రవీందర్, మరియ, స్త్రీనిధి మేనేజర్ రాణి, సిబ్బంది పద్మ, సురేందర్, అశోక్ పాల్గొన్నారు.

కథలాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో సెర్ప్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం- ఆరోగ్యంపై మహిళా సంఘాల ప్రతినిధులు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారనే విషయాన్ని మహిళలు గుర్తించాలన్నారు. పోషకాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, వైద్యాధికారి సింధూజ, ఏపీఎం నరహరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమదిబేగం, సీసీలు అంజయ్య, రాజేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు పరిధిలో చిట్టాపూర్ సొసైటీ సమస్య



డీఎస్‌వో కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్ సొసైటీ సమస్యలు హైకోర్టు పరిధిలో ఉన్నాయని, కోర్టు తుది తీర్పుకు లోబడి చర్యలు తీసుకుంటామని జిల్లా సహకార అధికారి సీహెచ్. మనోజ్‌కుమార్ తెలిపారు. చిట్టాపూర్ సొసైటీ సమస్యలు పరిష్కరించాలని సోమవారం సంఘ సభ్యులు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ సొసైటీలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించి, రైతులకు న్యాయం చేయాలని సంఘ సభ్యులు కోరారని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్, బోడ శేఖర్, కిరణ్, అంజిబాబు, గుజ్జుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలో పలు చోట్ల డ్రైయినేజీలు లేక మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి యజమానులు వ్యర్థాలను రోడ్లపైకి వదులుతుండటంతో ఆ మురుగునీటి నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించలేక వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీటిలో పందులు దోమలతో కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. బల్దియా అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చిరంజీవి, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల, సెల్ నంబర్: 98499 05877

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ముఖ్యమంత్రే ఓటమిని అంగీకరించారు

• ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



ధర్మపురిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ధర్మపురి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఓటమిని స్వయాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే బహిరంగ సభలో అంగీకరించారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ధర్మపురిలో సోమవారం నిర్వహించిన బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి ఓడినా కాంగ్రెస్‌కు వచ్చిన నష్టం లేదని సీఎం అనడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించేందుకు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ధర్మపురి నృసింహస్వామి సన్నిధి నుంచే గెలుపు శంఖారావం పూరిస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నం అంజన్న, గోమాస శ్రీనివాస్ తదితరులున్నారు.

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, చింతకుంట, రాజారాం తండా గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా బీజేపీ నాయకులు సోమవారం ప్రచారం చేశారు. అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్మల వినోద్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు జాతర విధులు



కార్మికులకు సూచనలిస్తున్న కమిషనర్

మెట్‌పల్లి: మహాశివరాత్రిని పురస్కరించుకుని వేములవాడలో జరిగే జాతర సందర్భంగా పారిశుధ్య విధులు నిర్వహించడానికి మెట్‌పల్లి మున్సిపల్‌కు చెందిన పలువురు కార్మికులను కేటాయించారు. సోమవారం వారికి కమిషనర్ మోహన్ పలు సూచనలు చేశారు. జాతర విధుల పట్ల నిర్లక్ష్యం చూపితే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని, దీనిని దృష్టిలో పెట్టుకుని విధులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ఎమ్మెల్సీ ప్రచారం



పట్టభద్రులను ఓటడుగుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: ఎమ్మెల్సీగా అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. సోమవారం ఉదయం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపు కోదండరామాలయం వాకింగ్ గ్రౌండ్‌లో వాకింగ్ చేసిన జీవన్‌రెడ్డి పట్టభద్ర ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. గతంలో తనను గెలిపించినట్లుగా నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో నాయకులు బింగి రవి, ఉత్తూరి గంగాధర్, మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులను కలిసిన జీవన్‌రెడ్డి

జగిత్యాలజోన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా జీవన్ రెడ్డి సోమవారం న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టులో రెండో అంతస్తు నిర్మాణానికి సీఎంతో మాట్లాడి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

నరేందర్‌రెడ్డి కి సీపీఎం మద్దతు

జగిత్యాలటౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఊట్కూరి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లెల బాలకృష్ణ కోరారు. సోమవారం జగిత్యాలలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో బాలకృష్ణ పాల్గొని మాట్లాడారు. సీపీఎం పార్టీ మద్దతు ఇస్తున్న నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు జి తిరుపతినాయక్, సీనియర్ నాయకులు సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌కు తాళం వేసి నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పోస్ట్‌మాస్టర్ ఆనంద్

బుగ్గారం: పోస్టాఫీస్ తాళం వేసి బ్రాంచ్ పోస్టుమాస్టర్ నిరసన వ్యక్తం చేసిన సంఘటన మండలంలోని గోపులాపూర్‌లో సోమవారం చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. గోపులాపూర్‌లో బ్రాంచ్ పోస్టాఫీస్‌లో పని చేసే బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఆనంద్ అనారోగ్యంతో బాధపడుతుండగా, అధికారులు సెలవు ఇవ్వకపోవడంతో పోస్టాఫీస్‌కు తాళం వేసి నిరసన వ్యక్తం చేసినట్లు దీనిపై ఆనంద్‌ను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. దీంతో పోస్టాఫీస్‌లో సేవలు అందపోవడంతో చాలా మంది తిరిగి వెళ్లిపోయారు.

మండలంలో బీసీ నాయకుల ప్రచారం

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ సోమవారం ప్రచారం చేశారు. కోచింగ్ సెంటర్, ఉద్యోగాల సాధనకు పుస్తకాలు తయారుచేసి ఎంతోమందిని ఉద్యోగాలు సాధించేందుకు ప్రసన్న హరికృష్ణ ప్రోత్సహించారని పేర్కొన్నారు. అలాంటి నాయకుడిని ఎమ్మెల్సీగా గెలిపించాలని ఓటర్లకు నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

మెట్‌పల్లి: పట్టణంలోని శివభక్త మార్కండేయ ఆలయ పునర్నిర్మాణం కోసం స్థానిక వ్యాపారి బొప్పరాతి లక్ష్మణ్ రూ.6.35 లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు ఆయన చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా దాత లక్ష్మణ్‌కు ఆలయ కమిటీ సభ్యులు మహారాజ పోషకులుగా సభ్యత్వం ఇచ్చి సన్మానించారు. . కార్యక్రమంలో పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ధ్యావనపల్లి రాజారాం, కమిటీ సభ్యులు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు శిక్ష

మెట్‌పల్లిరూరల్: డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో కోర్టు జరిమానా విధించి, మరోమారు పోలీసులకు పట్టుబడిన ఓ వ్యక్తికి మెట్‌పల్లి సబ్ కోర్టు జైలు శిక్ష విధించింది.వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన గూడ సురేశ్ అనే వ్యక్తి గతంలో ఓసారి మద్యం సేవించి వాహనం నడుపుతుండగా ఇబ్రహీంపట్నం పోలీసులకు పట్టుబడ్డాడు.ఆ సమయంలో కోర్టు జరిమానా విధించింది.ఇదిలా ఉండగా ఈ నెల 11 న మెట్‌పల్లి మండలం మేడిపల్లి శివారులో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.ఇందులో సురేశ్ మరోమారు మద్యం సేవించి పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు సోమవారం అతన్ని కోర్టులో హాజరుపర్చారు. ఈ మేరకు మేజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ 4 రోజుల పాటు అతడికి జైలు శిక్ష విధించారు.

మహిళా సంఘాలకు శిక్షణ

సారంగాపూర్: మహిళా సంఘాల్లో వివిధ హోదాల్లో ఉన్నవారికి బీర్‌పూర్ మండల కేంద్రంలోని జన జాగృతి మండల సమాఖ్య, సెర్ప్ ఆధ్వర్యంలో సోమవారం ఆరోగ్యం, పౌష్టికాహారం, పరిశుభ్రత తదితర అంశాలపై మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, వీవోఏలకు శిక్షణ ఇచ్చారు.శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజొద్దీన్, ఎంపీడీవో లచ్చాలు, డీపీఎం మల్లేశం, ఐకేపీ ఏపీఎం రమేశ్, సీసీ పుష్ప, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బల్బుల తయారీపై విద్యార్థులకు అవగాహన

కోరుట్ల: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎల్ఈడీ బల్బుల తయారీపై వివరించారు. మేకిన్ ఇండియా, ఒకల్ ఫర్ లోకల్ కార్యక్రమంలో భాగంగా స్వయం ఉపాధిలో సాంకేతిక పరిజ్ఞానం జోడించాలనే సంకల్పంతో ప్రధాని మోదీ పిలుపు మేరకు ఇంట్లో వాడే బల్బుల తయారీపై వివరించారు. విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మోహన్ రావు,విజ్ఞాన శాస్త్ర ఇన్నోవేటర్ మల్లేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కొత్తవాడలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2008–09 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం వారు ఎవరెక్కడ స్థిరపడ్డారని, యోగ క్షేమాలు తెలుసుకున్నారు. తమకు చదువు చెప్పిన హెచ్ఎం రాజమౌళి, ఉపాధ్యాయులు రాములు, రాజేశ్వర్, భూమయ్య, జయసింహారావు, రాజశేఖర్, వెంకట్‌రెడ్డిలను సత్కరించారు.